

శూన్యమే ధ్యానం

నోటిలోని మౌనం, మనసులోని శూన్యమే ధ్యానమని ధ్యానగురువు పరిణీత పత్రి పేర్కొన్నారు. 8లో▸



జయప్రదం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ పిలుపునిచ్చారు. 8లో▸



హుక్కా సెంటర్‌పై దాడులు

నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న హుక్కా సెంటర్‌పై బాలాపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

చారిత్రక ఆలయాలను కాపాడుకోవాలి



పురాతన శివాలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు

నందిగామ: చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయాలు, శిల్పాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడ అక్కమ్మ చెరువు కట్ట కింద ఉన్న పురాతన శివాలాయాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పైన శిఖరం, బయటి గోడలు పడిపోయిన ఈ ఆలయం సుమారు 1,100 సంవత్సరాల క్రితం రాష్ట్రకూటులనే రాజులచే నిర్మింపబడి ఉంటుందని అన్నారు. అర్ధ మండపంలో కాకతీయుల కాలపు సప్తమాతృకలు, గణేశ శిల్పాలు ఉన్నాయని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ ఆలయాన్ని, శిల్పాలను కాపాడాలని గ్రామస్తులకు సూచించారు.

'స్థానిక' ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాపోల్ నర్సింహులు

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి విఠలయ్య, యూత్ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు రాజు, అజీం, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా నవీన్‌కుమార్



సర్టిఫికెట్ అందుకుంటున్న నవీన్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ శిక్షకుడిగా సర్టిఫికెట్ అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారికి వ్యక్తిత్వ, వికాస నైపుణ్యతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజిపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ ఆదివారం వ్యక్తిత్వ, వికాస నైపుణ్యతపై అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు సినీనటుడు కేవీ ప్రదీప్ ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు.

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

ఆర్గనైజర్, యాజమాన్యంపై కేసు నమోదు

మొయినాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తూ ఆల్కహాల్, హుక్కా వినియోగిస్తున్న ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేశారు. పార్టీ నిర్వహిస్తున్న ఆర్గనైజర్‌తోపాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లిలోని సయిాద్ ఫాంహౌస్‌లో శనివారం అర్ధరాత్రి సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తున్నారు. పార్టీలో ఆల్కహాల్, హుక్కా వినియోగిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీని భగ్నం చేశారు. మద్యం బాటిళ్లు, హుక్కాను స్వాధీనం చేసుకున్నారు. పార్టీ నిర్వహిస్తున్న ఆర్గనైజర్‌తోపాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుధిర దారులు





చేవెళ్ల మండలం ఆలూరు వద్ద జరిగిన ప్రమాదం



ఓఆర్ఆర్‌పై ట్యాంకర్‌ను ఢీకొట్టిన వాహనం

రక్తపుటేరులు పారించిన రహదారులు

- ప్రాణాలు కోల్పోయిన వందలాదిమంది
- క్షతగాత్రులుగా మిగిలినవారెందరో..
- కొత్త ఏడాదిలోనైనా రోడ్ల విస్తరణ జరిగేనా?

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రహదారులు రక్తపుటేరులు పారిస్తున్నాయి. వాహనాల రద్దీ మేరకు రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోవడం.. మద్యం తాగి మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుండటం.. ప్రమాదకరమైన మూల మలుపులే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం వెలుగు చూస్తూనే ఉంది. ఎవరో ఒకరు మృత్యువాతపడుతూనే ఉన్నారు. అయినా పాలకుల్లో చలనం మాత్రం రావడం లేదు. ప్రమాదాలను నియంత్రించే చర్యలు చేపట్టడం లేదు. కొత్త సంవత్సరంలోనైనా రోడ్ల వ్యవస్థ మెరుగుపడుతుందో లేదో వేచి చూడాల్సిందే.

2024లో తీరని విషాదం

విజయవాడ జాతీయ రహదారి ఇటు ఎల్బీనగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం వరకు, బీజాపూర్ జాతీయ రహదారి ఇటు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు విస్తరించి ఉంది. బెంగళూరు జాతీయ రహదారి ఆరాంఘర్ నుంచి షాద్‌నగర్ మండల వరకు, శ్రీశైలం జాతీయ రహదారి చాంద్రాయణగుట్ట నుంచి ఆమనగల్లు మండల శివారు వరకు విస్తరించింది. నాగార్జునసాగర్ జాతీయ రహదారి ఎల్బీనగర్ నుంచి యాచారం మండల శివారు వరకు, హైదరాబాద్ నగరానికి మణిహారంగా గుర్తింపు పొందిన ఓఆర్ఆర్ ఇటు కోకాపేట నుంచి అటు తారామతిపేట వరకు విస్తరించి ఉంది. ఇక పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే సహా ఆర్ అండ్‌బీ, మున్సిపాలిటీ అంతర్గత రోడ్లు అనేకం ఉన్నాయి. ఆయా రహదారులు 2024లో జిల్లాలోని అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చాయి.

2025లోనైనా పనులు ప్రారంభమయ్యేనా?

ప్రమాదాలకు నిలయంగా మారిన బీజాపూర్ జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరణకు 29 ఏప్రిల్ 2022లో అప్పటి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి శంకుస్థాపన చేశారు. టెండర్ కూడా ఖరారైంది. ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల ఆలూరు స్టేజీ వద్ద రోడ్డు వెంట కూరగాయలు అమ్ముకుంటున్న వారిపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కేవలం ఈ ఒక్క రోడ్డుపైనే మూడేళ్ల వ్యవధిలో 379 ప్రమాదాలు చోటు చేసుకోగా, సుమారు 400 మంది క్షతగాత్రులయ్యారు. 146 మంది ప్రాణాలు కోల్పోయారు. ఓఆర్ఆర్‌పై అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్క, తమ్ముడు మృతి చెందారు. ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. నూతన సంవత్సరంలోనైనా విస్తరణ పనులు ప్రారంభమవుతాయో లేదో వేచి చూడాలి.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలు


సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	701	735	3,485
2024	624	653	3,003

ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	25	30	62
2024	18	19	58

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలు

అంశం	2023		2024	
వాహనాలు	ప్రమాదాలు	మృతులు	ప్రమాదాలు	మృతులు
పాదచారులు	290	299	256	261
సైకిల్	10	10	10	10
మోటార్ సైకిల్	418	444	447	465
ఆటో/ట్రాలీ ఆటో	24	24	30	27
లైట్ మోటార్ వెహికిల్స్	44	57	43	53
హెవీ వెహికిల్స్	26	32	19	26
మొత్తం	812	866	805	842



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

పురం.. నిశ్శబ్దం!

- జనవరి 26తో ముగియనున్న మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు
- జీహెచ్ఎంసీలో విలీనం ఉండబోదని అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన
- అయినప్పటికీ అధికారిక ప్రకటన రాకపోవడంతో వీడని ఉత్కంఠ
- రాజకీయంగా నెలకొన్న స్తబ్ధత

తుర్కయంజాల్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పదవీకాలం జనవరి 26వ తేదీతో ముగియనుంది. దీంతో యథావిధిగా కొనసాగుతాయా లేక జీహెచ్ఎంసీలో విలీనం అవుతాయా అనేది అధికారికంగా తేలాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఔటర్ లోపలి కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయాలని భావించింది. ఈ దిశగా కసరత్తు కూడా కొనసాగించిన విషయం తెలిసిందే. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మొత్తం ప్రాంతాన్ని జీహెచ్ఎంసీగా మార్చనున్నామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గ్రేటర్‌ను విడగొట్టి 3, 4 కార్పొరేషన్‌లు చేయడం లేదని చెప్పడంతో కొంత స్పష్టత వచ్చిందని అంతా అనుకుంటున్నారు. అయినప్పటికీ ఇంకా అధికారికంగా ప్రకటించకపోవడంతో అందరిలో ఉత్కంఠ కొనసాగుతోంది.

3 కార్పొరేషన్‌లు, 12 మున్సిపాలిటీలు

జిల్లాలో మీర్‌పేట, బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లు, తుర్కయంజాల్, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట, జల్‌పల్లి, మణికొండ, నార్సింగి, శంషాబాద్, తుక్కుగూడ, ఆమనగల్లు ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉండగా.. ఇబ్రహీంపట్నం, శంకర్‌పల్లి, షాద్‌నగర్ బయట ఉన్నాయి. అన్ని పాలకవర్గాల పదవీ కాలం వచ్చేనెల 26తో ముగియనుంది. ఇప్పటికే జిల్లాలోని పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల గడువు ముగియడంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఒకవేళ విలీనం లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సైతం ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోలేదు.

కొనసాగుతున్న స్తబ్ధత

పదవీకాలం ముగిసే ఆరు నెలల ముందు నుంచే ఆశావహులతో రాజకీయ వాతావరణం వేడెక్కేది. కానీ గ్రేటర్‌లో విలీనం అనే వార్తలు ప్రచారం కావడం.. అధికారులు కూడా దానికి తగ్గట్లుగా గతంలో సంకేతాలు ఇవ్వడంతో పదవీ కాలం ముగుస్తున్నప్పటికీ రాజకీయ వాతావరణం స్తబ్ధుగా ఉండిపోయింది. పోటీలో నిలవాలనుకునే వారిలో నిరాశ నిండిపోయింది. మరోవైపు గ్రేటర్ పదవీ కాలం గడువు 5 మే 2026 వరకు ఉండడంతో ఇప్పట్లో ఎన్నికలు ఉండవనే భావన చాలా మందిలో నెలకొంది. విలీనంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకుంటే ఈ స్తబ్ధత మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, గిరిజనులు

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుదామని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం లంబాడీల గర్జన నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి ఫంక్షన్‌హాల్ వరకు గిరిజనులు భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంబల్ నాయక్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా గిరిజనులు మాత్రం అన్ని రంగాల్లో వెనకబడే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందించాలని అన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. పట్టణాలకు, గ్రామాలకు దూరంగా ఉండే తండాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చందు నాయక్, నాయకులు మిట్టు నాయక్, శ్రీను నాయక్, లక్ష్మణ్ నాయక్, హన్యా నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టీచర్లకు సదావకాశం

- రాష్ట్రస్థాయి సెమినార్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- జనవరి 20 వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకునే అవకాశం
- ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజు ప్రదర్శన
- ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు సన్మానం



కేశంపేట: శాస్త్రీయ దృక్పథాన్ని మరింతగా పెంచి విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు సైన్స్ ఉపాధ్యాయులను సమాయత్తం చేయాలనే లక్ష్యంతో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) కృషి చేస్తోంది. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల్లో సైన్స్ బోధించే ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో సైన్స్ సెమినార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన సైన్స్‌లో పీజీ చేసిన ఉపాధ్యాయులు, బీఈడీ, డైట్ కళాశాలల నుంచి విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎంపిక చేసుకోవాల్సిన అంశాలు..

సైన్స్ ఉపాధ్యాయులు విద్యాశాఖ సూచించిన అంశాల్లో తమ ప్రతిభ కనబర్చాల్సి ఉంటుంది.

- మన ప్రపంచంలో సైన్స్ అనే అంశంపై లేదా సైన్స్ బోధనలో కృతిమ మేధ (ఆర్టిఫిషియల్) ప్రభావం.
- పాఠశాలల్లో సుస్థిర పర్యావరణ వ్యవస్థ, నిర్వహణ వ్యూహాలు.
- విద్యార్థుల శ్రేయస్సుకు ఆహారం విద్య, ఉపాధ్యాయుల పాత్ర.
- రసాయన శాస్త్రం నేర్చుకునేందుకు ఉన్న సాధనాలు.
- సైన్స్‌లో విద్యా ప్రమాణాలు మెరుగు కోసం ఉన్న శాస్త్రీయ మార్గాలు.

దరఖాస్తు విధానం

సైన్స్ సెమినార్‌లో పాల్గొనేందుకు అసక్తి ఉన్న సైన్స్ ఉపాధ్యాయులు విద్యాశాఖ సూచించిన అంశాల్లో ఏదైనా ఒక అంశాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. mail:tgscertseminar@gmail.comకు పూర్తి వివరాలతో జనవరి 20వ తేదీ వరకు మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు పంపిన నివేదికలను పరిశీలించి ఉత్తమ అంశాలను సెమినార్‌కు ఎంపిక చేస్తారు. ఎంపికైన అంశాలతో ఉపాధ్యాయులు ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజున వివరించాల్సి ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రం ఇచ్చి సన్మానించనున్నారు.

వినియోగించుకోవాలి



రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సైన్స్ సెమినార్‌ను సైన్స్ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధ్యాయులు ప్రదర్శించే అంశాలతో రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు కలుగుతుంది. మరిన్ని వివరాలకు 93953 90985 నంబర్‌లో సంప్రదించండి.

– శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి

నుమాయిష్ టికెట్ ధర పెంపు

- రూ.40 నుంచి రూ.50కి ప్రవేశ రుసుము
- జనవరి 3 నుంచి ఎగ్జిబిషన్
- సుమారు 2 వేల స్టాళ్లు ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన సొసైటీ ప్రతినిధులు



వివరాలు వెల్లడిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు

అబిడ్స్: జనవరి 3 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) ప్రవేశ రుసుమును ఈసారి రూ.40 నుంచి రూ.50కి పెంచనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. 2 వేల స్టాళ్లతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జనవరి 1న ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్‌ను ఈ ఏడాది రెండు రోజులు వాయిదా వేశామని, 3వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి ఆర్.సురేందర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ ప్రభా శంకర్, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, పబ్లిసిటీ కన్వీనర్లు సురేష్‌కుమార్, సురేష్‌రాజ్ మాట్లాడారు. జనవరి 1న ప్రారంభం కావాల్సిన ఎగ్జిబిషన్‌ను మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల కారణంగా జనవరి 3న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో డబుల్ డెక్కర్ బస్సును మినీ ట్రైన్‌తో పాటు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం నుంచి రాత్రి 10.30 గంటల వరకు, శని ఆదివారాల్లో రాత్రి 11.30 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. మినీ ట్రైన్ టికెట్ రూ.30, డబుల్ డెక్కర్ టికెట్ రూ.40గా నిర్ణయించినట్లు చెప్పారు.

కమాండ్ కంట్రోల్, వైఫై టవర్..

మొదటిసారిగా పలు శాఖల అధికారుల కోసం కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం సెల్ ఫోన్ల నెట్‌వర్క్ సమస్య వస్తుండడంతో మొదటిసారిగా వైఫై టవర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నుమాయిష్‌లో సీనియర్ సిటిజన్ల కోసం వీల్ చైర్లను సమకూరుస్తున్నామన్నారు. జనవరి 7వ తేదీన లేడీస్ డేగా, జనవరి 31వ తేదీని చిల్డ్రన్స్ డేగా ప్రకటించినట్లు తెలిపారు. గత ఏడాది నుమాయిష్ నిర్వహణ ద్వారా ప్రభుత్వానికి వివిధ రకాల పన్నుల రూపంలో రూ.66 కోట్ల ఆదాయం సమకూర్చినట్లు వారు వివరించారు. ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

దిగజారుతున్న దేశ ఆర్థిక పరిస్థితి

- వాగ్దానాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- ప్రజా సమస్యలపై పోరుబాట
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఇబ్రహీంపట్నం: బీజేపీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరుగుతున్న పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా ఆదివారం రెండోరోజు జరిగిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. నిత్యావసరవస్తువులతోపాటు అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగిపోతున్నా కట్టడి చేసే పరిస్థితుల్లో పాలకులు లేరన్నారు. యువతకు ఉపాధి కల్పనలో పాలకులు విఫలమయ్యారని మండిపడ్డారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు లాభపడేవిధంగా పేదల భూములను ప్రభుత్వాలు లాక్కుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సమైక్యత, సమగ్రత, లౌకికవాదాన్ని కాపాడేందుకు సీపీఎం కట్టుబడి ఉందన్నారు.

వాగ్దానాల అమలులో విఫలం

ఎన్నికల ముందు ఆ తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ విఫలమైందని సుదర్శన్ విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో అన్ని సామాజిక వర్గాలకు స్థానం కల్పించాలన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుంటే పోరుబాట పడతామని హెచ్చరించారు. జనవరి 25న సంగారెడ్డి జిల్లాలో జరిగే పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తే.. రూ.80 వేల కోట్లు తగ్గించి పేదల జీవనోపాధిని కేంద్రం దెబ్బ తీస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన ఆయావర్గాల అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని మంటగలిపే విధంగా దేశంలో, రాష్ట్రంలో పాలన సాగుతోందని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల బాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సామేల్, యాదయ్య, జగదీశ్, మధుసూదన్‌రెడ్డి, కవిత, చంద్రమోహన్, శోభన్, రాంచందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడులు



హుక్కా పరికరాలతో పట్టుబడ్డ యువకులు

పహాడీషరీఫ్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న హుక్కా సెంటర్‌పై బాలాపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్ రోడ్డులో యాహ్యా అనే వ్యక్తి కొన్నాళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా హుక్కా పార్లర్ కొనసాగిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి యజమాని యాహ్యాతో పాటు మేనేజర్ షోహెబ్, వినియోగదారులు సోఫియన్ బాబా (26), సయ్యద్ మన్సూర్ (20), సయ్యద్ అస్లాం(19), మహ్మద్ నూర్ (19), షేక్ అలీ(22)పై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

ఆటో కింద పడి చిన్నారి మృతి



ప్రియాన్సి మృతదేహం

ఆమనగల్లు: ప్రమాదవశాత్తు ఆటో కింద పడి 11 నెలల చిన్నారి మృతిచెందింది. ఈ సంఘటన తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పుష్పరాజ్ యాదవాసి కుటుంబ సభ్యులతో బతుకుదెరువు కోసం పడకల్‌కు వచ్చాడు. ఇదే గ్రామంలోని శేఖర్‌యాదవ్ పొలం వద్ద పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు పొలం వద్ద పాల డబ్బాలను ఆటోలో తరలించే క్రమంలో పుష్పరాజ్ కూతురు ప్రియాన్సి (11)నెలలు ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లింది. ఇది గమనించని డ్రైవర్ నరేశ్ ఆటోను ముందుకు తీసుకెళ్లడంతో చిన్నారి తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం కడ్తాల్ మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు.

నేడు హకీంపేట్‌కు తమ్మినేని

దుద్యాల్: లగచర్ల ఘటనలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బుస్స చంద్రయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ భూముల కోసం పోరాటాలు చేసిన రైతులపై అక్రమ కేసులు పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. సోమవారం నిర్వహించనున్న సభకు కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ, డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు హాజరవుతారని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

వేటగాళ్ల వలకు కొండ చిలువ



కొండ చిలువను పరిశీలిస్తున్న అధికారులు

దౌల్తాబాద్: అడవి పందులకు వేసిన వలలో భారీ కొండచిలువ చిక్కింది. ఈ ఘటన ఆదివారం దౌల్తాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, అటవీ అధికారులు తెలిపిన ప్రకారం.. దౌల్తాబాద్, రావులపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు వలలు వేశారు. ఆ వలలో భారీ కొండచిలువ చిక్కింది. ఉదయం గమనించిన వేటగాళ్లు పోలీసులకు సమాచారం తెలపడంతో అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తిరిగి అడవిలోనే వదిలేస్తామని చెప్పారు.



కళాకారుల ప్రదర్శన



మాట్లాడుతున్న పరిణిత పత్రి



హాజరైన ధ్యానులు

మనసులోని శూన్యమే ధ్యానం

ధ్యానగురువు పరిణిత పత్రి ● తొమ్మిదో రోజుకు చేరిన ధ్యాన ఉత్సవాలు



కళాకారుల నృత్య విన్యాసం

నోటిలోని మౌనం, మనసులోని శూన్యమే ధ్యానమని ధ్యానగురువు పరిణిత పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్‌లో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు ఆదివారానికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధ్యానగురువు పరిణిత పత్రి మాట్లాడుతూ.. ధ్యానం చేస్తే బుద్ధుడవుతారని, సకర్మలు చేస్తే ఫలితం పొందుతారని తెలిపారు. ఉన్నదాంట్లో సంతృప్తి చెందాలని, లేని దానికి అత్యాశకు పోవద్దని సూచించారు. సరికాని ఆలోచనలను సరైన స్థితిలోకి తీసుకెళ్లడమే ధ్యానమన్నారు. అనంతరం ప్రముఖ యోగ గురువు వెంకటేశ్ గురుజీ ధ్యానం, యోగా, ప్రాణాయామం గురించి వివరించారు. ధ్యాన వేదికపై కళాకారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆదివారం కావడంతో ధ్యాన కేంద్రానికి పెద్ద సంఖ్యలో ధ్యానులు తరలివచ్చారు.

– కడ్తాల్



కళాకారిణి నృత్య ప్రదర్శన

యువతి అదృశ్యం



హాజేరా ఫాతిమా(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్ అన్వర్ హుస్సేన్ చిన్న కుమార్తె హాజేరా ఫాతిమా అలియాస్ సమ్రీన్(20) ఇంటర్ వరకు విద్యనభ్యసించి ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 27వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులతో పాటే నిద్రించిన సమ్రీన్ మరుసటి రోజు 28న నిద్రలేచి చూడగా కనిపించలేదు. ఫాజిల్ అనే యువకుడు సమ్రీన్‌ను తీసుకొని వెళ్లి ఉంటాడన్న అనుమానంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని, 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం అందించాలని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మొయినాబాద్: గండిపేట చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో ఉన్న గండిపేట చెరువులో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని ఒంటిపై ఎర్రరంగు చెక్స్ షర్ట్, నేవీ బ్లూ రంగు బనియన్, గ్రే కలర్ షార్ట్ ఉన్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కారు నడిపి..



డివైడర్ పైకెక్కిన బెంజ్ కారు

బంజారాహిల్స్: ఓ యువకుడు మద్యం మత్తులో కారు నడిపి మితిమీరిన వేగంతో చెట్టుకు, డివైడర్‌కు ఢీకొట్టిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. వెస్ట్ మారేడ్‌పల్లి సుమన్ హౌసింగ్ కాలనీలో నివసించే తీగుళ్ల దయాసాయిరాజ్ (27) రైల్వే ఆఫీసర్స్ కాలనీలో నివసించే తన స్నేహితురాలు (27)తో కలిసి శనివారం రాత్రి ఫిలింనగర్ సమీపంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ విందుకు హాజరయ్యాడు. ఇద్దరూ ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల వరకు ఆ విందులో పాల్గొని మద్యం తాగారు. దయాసాయిరాజ్ మోతాదుకు మించి మద్యం తాగి ఇంటికి వెళ్లే క్రమంలో తన స్నేహితురాలిని తీసుకుని అర్ధరాత్రి 2.30 గంటలకు ఫంక్షన్ హాల్ నుంచి బెంజ్ కారు బయలుదేరాడు. సినీ నటుడు బాలకృష్ణ ఇంటి వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను, ఆ తర్వాత చెట్టును ఢీకొని రోడ్డుకు అవతల వైపు బోల్తాపడింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. చెట్టు విరిగిపడి డివైడర్ ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వీరిద్దరినీ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఉదయం 3 గంటలకు స్టేషన్‌కు తీసుకువచ్చిన వీరిద్దరినీ డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌కు యత్నించగా వీరు సహకరించలేదు. 3 గంటల పాటు పోలీసులను దూషిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఠాణాలో న్యూసెన్స్ చేశారు. మద్యం మత్తులో స్టేషన్‌లో ఇద్దరూ వీరంగం సృష్టించారు. ఎట్టకేలకు వీరికి శ్వాస పరీక్షలు నిర్వహించగా దయాసాయిరాజ్‌కు 94 ఎంజీ, యువతికి 73 ఎంజీ రక్తంలో ఆల్కహాలిక్ నమోదైంది. వీరిద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. హత్యాయత్నం కింద సెక్షన్ విధించి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

ఫిలింనగర్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

ఫిలింనగర్: నూతన సంవత్సర వేడుకల వేళ ఫిలింనగర్‌లో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్స్‌తో పాటు ఓ కొనుగోలుదారును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. షేక్‌పేటలోని ఫాల్కన్ కాలనీలో నివసించే ఎండీ అబ్దుల్ ఇర్ఫాన్ కారు డీలర్‌గా పని చేస్తున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారి షేక్ మహ్మద్ రెహమాన్ అలీ న్యూ ఇయర్ వేడుకలకు అవసరమైన వారికి డ్రగ్స్ విక్రయించేందుకు ముంబై నుంచి ఇటీవలే ఎండీఎంఏ డ్రగ్స్‌ను నగరానికి తీసుకువచ్చాడు. ఇర్ఫాన్‌తో కలిసి నాలుగు రోజుల పాటు డ్రగ్స్ విక్రయించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగానే ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్దకు రెహమాన్ అలీ చేరుకుని మరో పెడ్లర్ ఇర్ఫాన్‌ను అక్కడికి పిలిపించాడు. అవసరమైన వారికి సరుకును విక్రయించే క్రమంలో బహదూర్‌పురాకు చెందిన సయ్యద్ హుజ్మతుల్లాను పిలిపించారు. కొత్త చెరువు వద్ద వీరిద్దరూ కలిసి హుజ్మతుల్లాకు డ్రగ్స్ ఇచ్చే క్రమంలో అప్పటికే సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని వీరి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. రెహమాన్ అలీ ఇటీవలే డ్రగ్స్‌ను ముంబై నుంచి తీసుకు వచ్చినట్లుగా తేల్చారు. ఇర్ఫాన్‌తో కలిసి డ్రగ్స్‌ను విక్రయించాలని పథకం వేసినట్లుగా పోలీసులు గుర్తించారు. కొనుగోలు చేయడానికి వచ్చిన హుజ్మతుల్లాతో పాటు వీరిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జిల్లాస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, మాదిగ కళామండలి, డప్పు కళాకారులు, కవులు, అనుబంధ సంఘాలతో సోమవారం పట్టణంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. దళితులు ఎదుర్కొంటున్న ఎస్‌డీఎస్‌ఆర్ సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో వెయ్యి గొంతులు–లక్ష డప్పులు అనే నినాదంతో ప్రదర్శన చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనను విజయవంతం చేయడంలో భాగంగా పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాలులో ఉదయం 11 గంటలకు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ప్రజాగాయకుడు వేపూరి సోమన్న, మాదిగ కళామండలి జాతీయ అధ్యక్షుడు ఎస్వై అశోక్ హాజరు కానున్నారని అన్నారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, దళితులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు బాల్‌రాజ్, నర్సింహ, దశరథ్, నర్సింలు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఏపీజీవీబీ బ్యాంకు సేవలు

జనవరి 1 నుంచి టీజీబీ

దుద్యాల్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు చేసినట్లు హకీంపేట్ బ్యాంకు మేనేజర్ హరీశ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీజీవీబీ బ్యాంకు సేవలు మూడు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. పేరు మార్పునకు సాఫ్ట్‌వేర్ పనులు నిర్వహిస్తుండడంతో లావాదేవీలకు కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సేవలు నిలిపేసినట్లు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఈ నెల చివరి వరకు బ్యాంకుకు సంబంధించిన ఏటీఎం, యూపీఐ, మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, ఏఈపీఎస్, సీఎస్‌పీ సేవలు నిలిపివేసినట్లు తెలిపారు.



హకీంపేట్‌లోని బ్యాంకు

మామిడిలో యాజమాన్య పద్ధతులు

- వేల ఎకరాల్లో పంట సాగు
- పూత దశే అత్యంత కీలకం
- సూచనలు పాటించాలంటున్న ఉద్యానవన అధికారులు



ఆకుపచ్చ పురుగు

దుద్యాల్: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు అంటున్నారు. జిల్లాలో దాదాపు 20వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం పంట పూత దశలో ఉందని, వాతావరణం కూడా అనుకూలంగా ఉందని అధికారులు తెలిపారు. పూతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇస్తున్నారు. ముఖ్యంగా మామిడిలో కాండం తొలుచు పురుగు, రసం పీల్చే పురుగు అధికంగా ఆశించే అవకాశం ఉందంటున్నారు. చీడ పీగల నివారణ, దిగుబడి పెరగడానికి నెల రోజుల నుంచే నూనే మందులు పిచికారీ చేస్తున్నారు. వర్షాకాలం మధ్యలో చెట్ల అడుగు భాగంలో ఎలాంటి పురుగులు చేరకుండా భాస్వరం వంటి ఎరువులు వేసుకొని మట్టిన కప్పి మొక్కలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా దిగుబడి పెరిగే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. గతంలో చేపట్టిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నూనె మందుల పిచికారీల ప్రభావం ఒక ఎత్తయితే పూత దశలో అధిక చలి ఉండటం కూడా అవసరం అన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉన్నందున చెట్లకు పూత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రాత్రి వేళల్లో 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో మామిడి పూత అధికంగా వచ్చేందు సంకేతంగా భావించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పూత వచ్చిన కొన్ని రోజుల తర్వాతే మొగ్గ రూపాంతరం చెందుతుంది. అందుకు తగ్గట్టుగా పూత, మొగ్గ దశలో రైతులు సస్య రక్షణ చర్యల్లో భాగంగా మొక్కకు నీరు అందించాలి. పూత రాలకుండా చూడాల్సిన భాధ్యత ఎంతైనా ఉంది. అలాగే కొన్ని మొక్కలకు పూత చాలా తక్కువగా రావడం, మరి కొన్ని మొక్కలకు పూర్తి రాకపోవడం వంటివి కూడా జరుగుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారం కోసం కొన్ని ప్రత్యేక పద్ధతులను పాటిస్తే పూత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మొగ్గ దశలో లేని తోటల్లో..

- పూ మొగ్గ బయటకు వచ్చే వరకు నీటి తడి ఇవ్వరాదు.
- మొగ్గ పగిలే దశలో పొటాషియం నైట్రేట్ (13:0:45) 10 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీంతో మొగ్గ పగిలి పూత వచ్చే అవకాశం ఉంటుంది.
- జూన్, జూలై మాసంలో ఎరువులు వేయని మామిడి రైతులు ప్రస్తుత దశలో అర కిలో యూరియా, అర కిలో పోటాష్‌ను ఒక మొక్కకు చొప్పున వేసుకోవాలి.
- నీటి వసతి లేనివారు పిందె దశలో ఒక శాతం యూరియా ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- పూత ఆలస్యం అయితే తోటలో కాయ పెరుగుదల దశలో తప్పని సరిగా డ్రిప్ ద్వారా నీరు పెట్టుకోవాలి.

చీడ పీడల యాజమాన్యం

- ఆకులపై బూడిద మచ్చలు గమనిస్తే ముందు జాగ్రత్త చర్యగా నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా సాఫ్ 2 గ్రాములను ఒక లీటర్ నీటిలో కలిపి చెట్టుపై పిచికారీ చేసుకోవాలి.
- ఆకుపై నల్ల మచ్చలు ఉంటే పై కొమ్మలకు సోకి పూత రాలిపోతుంది. నివారణకు ఒక లీటరు నీటిలో 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ మందును కలిపి మొక్కపై పిచికారీ చేయాలి.
- పూత, పిందె దశలో ఆకుమచ్చ పురుగు వ్యాప్తి చెందితే నివారణకు ఒక గ్రాము కార్బండజిమ్ కలిపి 15 రోజు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- మొగ్గ తొందరగా విచ్చుకోవడానికి, పూలకాడ పొడవుగా పెరగడానికి పొటాషియం నైట్రేట్(13:0:45) 10 గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తేనెమంచు పురుగు ఉధృతి ఎక్కువైనప్పుడు డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా లీటరు నీటికి కలిని పిచికారీ చేయాలి.
- తామర పురుగు అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటిలో ఫిప్రోనిక్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా స్పైనోసాడ్(ట్రెసర్)0.3 మి.లీ. లేదా థాయోమిథాక్సమ్(అక్టరా) 0.3 గ్రాముల మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పిండినల్లి పురుగు నేల నుంచి చెట్టు పైకి పాకకుండా చెట్టు ప్రాధాన కాండంపై గ్రీసు పూసిన ప్లాస్టిక్ పేపర్లను భూమి నుంచి ఒకటిన్నర అడుగుల ఎత్తు వరకు కాండం చుట్టు చుట్టాలి.

చలి ప్రభావం అనుకూలమే



మాకు 20 ఎకరాల మామిడి తోట ఉంది. పదేళ్ల నుంచి మామిడి పంట సాగు చేస్తున్నాం. మొగ్గ దశలో చలి ఎక్కువగా ఉండటం మొక్కకు చాలా ఉపయోగమే. రాత్రి వేళ్లో 15 డిగ్రీల కంటే తక్కువగా ఉండాలి. అలా ఉన్నప్పుడే ఆశించిన మేరకు మొగ్గ రావడం జరుగుతుంది.

– పిట్ల మల్లేశ్, మామిడి రైతు, హస్నాబాద్

సూచనలు పాటించాలి



మామిడి రైతులు ఉద్యాన వన అధికారుల సలహాలు సూచనలు పాటించాలి. అధిక దిగుబడులు పొందాలంటే ఏ సమయంలో ఎలాంటి సస్య రక్షణ చర్యలు చేపట్టాలి అనే విషయాలు పూర్తిగా తెలుసుకొని ఆ దిశగా అడుగులు వేయాలి. పురుగు ఆశించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి.

– సత్తర్, ఉద్యానవన శాఖ అధికారి